క్లుప్తంగా

గెస్ట్ టీచర్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుంగతుర్తి : మండల కేంద్రంలోని టీఆర్ఎస్ఆర్ఎస్ బాలుర పాఠశాల/కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి 5నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి గెస్ట్ టీచర్ల నియామకానికి అభ్యర్థుల ఉంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.శేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్ఎస్ఆర్ఎస్ బాలుర పాఠశాల/కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, గణితం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, పీఈటీ, స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి పీజీ, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 30తేదీలోపు పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98665 59719ను సంప్రదించాలన్నారు.

ఆహ్వానపత్రిక అందజేత



మాజీ మంత్రి దామోదర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామశివారులోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రం ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్ దేవాలయంలో వచ్చే నెల 1న నిర్వహించనున్న హనుమాన్ జయంతి మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని సూర్యాపేటలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కలిసిన వారిలో సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి, కొప్పుల వేణారెడ్డి, భాస్కర్, గణపురం నరేష్, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, గుండా శేఖర్, గుండా హరినాథ్, గుండా ప్రభాకర్, గుండా యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సేవాదళ్ అధ్యక్షుడిగా రమేష్



రమేష్‌యాదవ్

మద్దిరాల : మండల కేంద్రానికి చెందిన వల్లపు రమేష్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డికి, ఎమ్మెల్యే మందుల సామేల్‌కు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌కు, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతా నికి తనవంతు శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కసనబోయిన లింగయ్య, భూతం లింగయ్య, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హనుమాన్ మాలధారుల పూజలు



పూజల్లో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

అర్వపల్లి : హనుమాన్ జయంతి సందర్భంగా 41రోజుల దీక్షలో భాగంగా జాజిరెడ్డిగూడెంలో హనుమాన్ మాలలు ధరించిన మాలధారులు శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్త బాలంజనేయ స్వామి దేవాలయంలో ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాలధారులకు కాంగ్రెస్ నాయకుడు, మాలధారుడు నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, మాజీ వార్డు సభ్యుడు గోగుల రాంమూర్తిలు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగారం : బిక్కేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వర్ధమానుకోట గ్రామ సమీపంలోని బిక్కేరువాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గ్రామశివారులో పట్టుకొని సీజ్‌చేసి, కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతలు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
పెన్‌పహాడ్ : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దోసపహాడ్ గ్రామ శివారులోని మూసీవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ఆలగడప, దాసారం గ్రామాలకు చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

భూసార పరీక్షతో లాభాలు

- భూమిలో పోషకాల స్థాయి తెలుసుకునే అవకాశం
- రైతులకు అవగాహన కల్పించని అధికారులు
- సరైన ఎరువులు వాడకపోవడంతో తెగుళ్ల బెడదతో ఏటా పంట నష్టాలు



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

పెన్‌పహాడ్ : పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే ముందుగా ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలి. ఈ పరీక్షలు గ్రామాల్లో ఏడాది మేలో నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. భూమిలోని పోషక విలువలు తగ్గితే ఆమేర రసాయన ఎరువులు వాడుతుంటారు. ఇలా విరివిగా రసాయన ఎరువులు వాడుతుండడంతో క్రమేణ భూసారం తగ్గుతోంది. అంతే కాకుండా తెగుళ్ల బెడద కూడా పెరిగి పంటలకు తీవ్ర నష్టం కలుగుతోంది. రైతులకు భూసార పరీక్షలపై వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే పంటల సాగుపై రైతులకు ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. భూముల్లో ఏరకమైన పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయి, భూమిలో పోషకాల స్థాయి, వాటిలో ఏ ఎరువులు వేయాలని అనే విషయాలపై రైతులకు అవగాహన కలగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. సరైన సమయంలో వర్షాలు పడకపోవడం, తెగుళ్ల బెడదతో రైతులు ఏటా పంటలు నష్టపోతున్నారు. ఈ క్రమంలో భూసార పరీక్షలు నిర్వహించి వాతావరణ పరిస్థితులకు తగిన పంటలను సాగు చేస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అవగాహన లేమితో పంట నష్టాలు..

రైతులు పంటల సాగుపై దృష్టి పెడుతున్నారు. కానీ భూమిలోని పోషకాల స్థాయి తెలుసుకోవడంలో విఫలమవుతున్నారు. విరివిగా రసాయన ఎరువుల వాడకంతో సాగువ్యయం పెరగడంతో పాటు భూమిలో పోషక విలువలు తగ్గుతున్నాయి. నేల స్వభావం తెలియక అవసరానికి మించి క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారు. అయినా పంట నష్టాలు చవిచూస్తున్నారు. భూసార పరీక్షల ప్రాధాన్యంపై రైతు సదస్సులు, సమావేశాల్లో వ్యవసాయ శాఖ పదేపదే చెబుతున్నా రైతులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. అలాగే భూసార పరీక్షల ఫలితాలను అధికారులు సమయానికి అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫలితాల ఆధారంగా సాగు..

భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. మొక్కల పెరుగుదలకు 16రకాల పోషకాలు అవసరమని, భూసార పరీక్షల ద్వారా భూమిలో లవణ సూచిక పోషకాలు, నత్రజని, భాస్వరం, పోటాష్‌ల లభ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగానికి అవకాశం ఉంటుంది. కొందరు రైతులు ఒకే పంటను తరచుగా సాగు చేస్తుండటంతో పాటు అధిక రసాయన ఎరువులను వినియోగిస్తుండటంతో భూమి సారం కోల్పోయి పంట దిగుబడులు తగ్గుతాయి.

భూసార పరీక్షలతో మేలు



భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు భూసార పరీక్షలు ఏటా చేయించుకోవాలి. ఈ పరీక్షలతో భూమి సారం ఎంతో తెలుస్తుంది. ఆ మేరకు భూమికి కావాల్సిన పోషకాలను ఇవ్వగలిగే ఎరువులు వాడుకునే అవకాశం ఉంటుంది. మేలో భూసార పరీక్షలు చేయించుకోవాలి. పంటల సాగులో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి.

– బి.కృష్ణసందీప్, మండల వ్యవసాయ అధికారి

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట) : ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోషియేషన్ హాల్‌లో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యావంతులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, చట్టసభల్లో ప్రశ్నించే గొంతుక అవుతానన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మరని, దేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పట్టభద్రులంతా ఓటేయాలన్నారు. బీజేపీ అంటేనే మోదీ అని.. మోదీ అంటేనే బీజేపీ అని కొనియాడారు. నిరుద్యోగులను, ఉద్యోగులను అధికార పార్టీ, బీఆర్ఎస్ పార్టీలు మోసం చేశాయని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాటలను నమ్మొద్దని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 12సీట్లు గెలుస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచందర్, కాపరవి, ఎం.యాదగిరి, సీహెచ్.హన్మంత్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



తిరుమలగిరి (తుంగతుర్తి) : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి



చివ్వెంల : సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి

తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రచారం



తిరుమలగిరిలో ప్రచారం చేస్తున్న నాయకులు



మద్దిరాలలో మాట్లాడుతున్న కోట గోపి

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ కోరారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తుంగతుర్తి రవి, పేరాల వీరేష్, జమ్మిలాల్, సోమేష్, వంశీ పాల్గొన్నారు.

మద్దిరాల : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ సంపూర్ణ మద్దతు తీన్మార్ మల్లన్నకేనని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, పోలోజు సైదులు, మల్లారెడ్డి, నారాయణ, రమేష్, రాజరాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికే టీజేఎస్ మద్దతు

భానుపురి (సూర్యాపేట) : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల పాలనలో విధ్వంసం సృష్టించి బీఆర్ఎస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ఎన్ని అక్రమాలకైనా పాల్పడి తన ఉనికిని చాటుకునే ప్రయత్నాలు చేస్తుందన్నారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ ఏ ఒక్క విభజన హామీని నెరవేర్చని బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీకి తాము మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్‌గౌడ్, లీగల్ సెల్ జిల్లా కోకన్వీనర్ వీరేష్‌నాయక్, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూర గోపి, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్‌గౌడ్, మల్సూర్‌నాయక్, యాకోబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భానుపురి(సూర్యాపేట) : సమావేశంలో మాట్లాడుతున్న గట్ల రమాశంకర్

ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420హామీలు ఇచ్చి ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చి నేడు ఆ హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కిందని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, ఎన్నికల ఇన్‌చార్జ్ గాలి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై శాసనమండలిలో ప్రభుత్వ విధానాలను ఎండగట్టడానికి ప్రశ్నించే గొంతుకనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాలను మోసం చేసి అధికారంలో కొనసాగుతున్నారని అన్నారు. ప్రజా సమస్యలను నిరంతరం పరిష్కరించడం కోసం విద్యావంతుడైన ఏనుగు రాకేష్‌రెడ్డిని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని వారు కోరారు. బ్లాక్ మెయిల్ చేస్తూ కోట్ల రూపాయాలు సంపాదించిన తీన్మార్ మల్లన్నను ఓడించి ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని వారు కోరారు. కేసీఆర్ ఆధ్వర్యంలోనే రాష్ట్ర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, అభివృద్ధిని కోరుకునే ప్రతి వ్యక్తి బీఆర్ఎస్ బలపర్చిన రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్యయాదవ్, వైస్ఎంపీపీ జక్కి పరమేష్, బత్తుల సాయిలుగౌడ్, గాజుల తిర్మల్‌రావు, గుగులోతు సురేందర్‌నాయక్, మహేశ్వరం మల్లికార్జున్, రేసు వెంకటేశ్వర్లు, బత్తుల విద్యాసాగర్, ఇమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

తుంగతుర్తి : నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యావంతుడు, మేధావి ప్రశ్నించే గొంతుక రాకేష్‌రెడ్డి గెలిస్తే మూడు జిల్లాలోని 32మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలకు సమానమన్నారు. బ్లాక్ మెయిలింగ్‌కు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ అని, ప్రజలను బ్లాక్ మెయిల్ చేసి పైసలు సంపాదించే వ్యక్తిని శాసనమండలికి పంపిస్తే మనందరిని బజారుకు ఈడ్చే పరిస్థితి వస్తుందన్నారు. 2లక్షలకుపైగా ఉద్యోగాలు ఇచ్చి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ వేతనాలు ఇచ్చి, ఫిట్‌మెంట్ 70శాతానికి పెంచి, అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశకార్యకర్తలు, హోంగార్డులకు పూర్తిస్థాయిలో సహకరించిన బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు అండగా ఉండాలన్నారు. 10ఏళ్లల్లో తుంగతుర్తి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసినప్పటికీ దానిని ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కొనసాగుతుందన్నారు. త్వరలోనే మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, నాయకులు గుండగాని రాములు, తునికి సాయిలు, దొంగరి గోవర్ధన్, తడకమళ్ల రవికుమార్, గోపగాని శ్రీనివాస్, వెంకన్న, సంతోష్, వెంకట్, ఉప్పలయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్



తుంగతుర్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి



మద్దిరాల : మాట్లాడుతున్న ఎస్‌ఏ.రజాక్

మద్దిరాల : ఈనెల 27న జరిగే నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ.రజాక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లోని ఉద్యోగులను తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వడ్డాణం మధుసూదన్, లౌవుడ్యా వెంకన్న, దామెర్ల వెంకన్న, శిరంశెట్టి వెంకన్న, మల్యాల నర్సయ్య, వెలుగు వెంకన్న, ఏలేటి మల్లారెడ్డి, రేసు వెంకన్న, మల్లు కళింగారెడ్డి, రాజేంద్రప్రసాద్, ఉమామహేశ్వర్, ఫరీద్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



స్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామశివారులో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీమాన్ అరుట్ల రవికుమారచార్యులు, అసూరి అరవిందాచార్యులు మంత్రోచ్చరణతో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణం జరిపించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, బంధకవి కృష్ణమోహన్, మిట్టకోల మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చివ్వెంల(సూర్యాపేట) : పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు వేస్తున్న వ్యాధి నివారణ ఉచిత టీకా కార్యక్రమాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పశువులకు గొంతువాపు, జబ్బవాపు, గొర్రెలకు చిటుకు వ్యాధి ప్రబలకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది నాగమ్మ, రమణ, వినోద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : పశువుల అంటు వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. తొలకరిలో పశువుల అంటు వ్యాధుల నివారణ కోసం బుధవారం చేపట్టిన ఉచిత టీకాల కార్యక్రమాన్ని అర్వపల్లిలో ప్రారంభించారు. పశువులన్నింటికి టీకాలు వేసుకోవాలని పశుపోశకులకు సూచించారు. ఈనెల 30వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో తిమ్మాపురం పశువైద్యశాల వీఎల్ఓ కెఎస్ఎస్ పద్మ, సిబ్బంది యాదగిరి, యాకయ్య, పశుపోశకులు పాల్గొన్నారు.



చివ్వెంల(సూర్యాపేట) : పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది



అర్వపల్లి : టీకాలు వేస్తున్న డాక్టర్ అర్జున్, సిబ్బంది

అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి



ప్రభాకర్ స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : బహుజన రాజ్యస్థాపనే లక్ష్యంగా అమరుల స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో బుధవారం మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, విప్లవోద్యమ నాయకుడు మండారి ప్రభాకర్ 5వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రభాకర్ విద్యార్థి దశ నుంచే పీడీఎస్‌యూలో చేరి విద్యార్థి సమస్యలు, ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని, మారోజు వీరన్న స్థాపించిన సీపీయూఎస్ఐ పార్టీలో ప్రభాకర్ క్రియాశీలకంగా పనిచేశారని అన్నారు. ఈ సందర్భంగా వివిధ కులాల, ప్రజాసంఘాల నాయకులు ప్రభాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, ప్రజాసంఘాల, రాష్ట్ర, జిల్లా నాయకులు కె.పర్వతాలు, గాజుల శ్రీనివాస్, మాండ్ర మల్లయ్యయాదవ్, బత్తుల వెంకన్న, మందుల విజయ, కుంట్ల ధర్మార్జున్, చామకూరి నర్సయ్య, నారబోయిన వెంకట్, దడిపల్లి వెంకట్, జీడి ఉపేందర్, బుక్కరాజు తిరుపతి, బొడ్డు శంకర్, లింగంపల్లి విజయ్, జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్, బూర్గుల నాగేందర్, బొడ్డు సోమరాజు, కె.మల్లయ్య, ప్రభాకర్ సతీమణి నిర్మల, చెరుకుపల్లి లక్ష్మణ్, నాగరాజు, రాజమ్మ, లక్ష్మి, రఫి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల సంతాపం



కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ తండ్రి కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బిగాల గణేష్‌గుప్త, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు గోలి శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రనాయక్ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, గండూరి ప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పలయ్యకు నివాళి

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు నల్లగుంట్ల ఉప్పలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ ఉప్పలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి, దండు మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ బెల్లంకొండ యాదగిరిగౌడ్ తదితరులు ఉన్నారు.

మాజీ ఉపసర్పంచ్‌కు పరామర్శ

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ కేసాని రామనర్సయ్య ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకోవడంతో అతడిని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి పరామర్శించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, నియోజకవర్గ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, కేసగాని మహేశ్వర్, మేకల రాంబాబు, శ్రీకాంత్, రాహుల్ ఉన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థి ఎంపిక



అక్కల సాయిచరణ్

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అక్కల సాయిచరణ్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం దామర శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థికి తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి నెలా రూ.1000 ఉపకార వేతనం అందుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా సాయిచరణ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబానికి మందకృష్ణ మాదిగ పరామర్శ



సైదమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మందకృష్ణ మాదిగ

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన చింతలచెరువు సైదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బుధవారం గ్రామానికి చేరుకుని మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులుమాదిగ, రాంబాబు, వెంకన్న, స్వామి పాల్గొన్నారు.

నర్సమ్మ మృతి తీరనిలోటు

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు పేరం నర్సమ్మ(90) మృతి తీరనిలోటని పలువురు సీపీఐ నాయకులు అన్నారు. మంగళవారం రాత్రి నర్సమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని బుధవారం సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మూరగుండ్ల లక్ష్మయ్య సందర్శించి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. వారి వెంట పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, పార్టీ మండల నాయకులు మద్దెల రాంమూర్తి, పొన్నం ఎల్లయ్య, అబ్బయ్య, వెంకన్న, మల్లయ్య తదితరులు ఉన్నారు.